ప్రజాశక్తి

బుధవారం 06 మార్చి 2024

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మానవ హక్కుల కమిషన్‌కు స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : మానవ హక్కుల ఉల్లంఘన కేసులను విచారించేందుకు ఈనెల 6న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ మిశ్రా నేతత్వంలోని బృందం మంగళవారం రాత్రి విజయవాడ చేరుకుంది. రాత్రి 8 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఈ బృందానికి కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్‌పి అద్నాన్ నయీం అజ్మి పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. జస్టిస్ మిశ్రాతోపాటు సభ్యులు డాక్టర్ డి.ఎం.మూలే, రాజీవ్ జైన్, సెక్రటరీ జనరల్ భరత్ లాల్, రిజిస్ట్రార్ సురాజిత్ డే, డిఐజి పాటిల్ కేతన్ బలిరాం, డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రజిత్ కుమార్, కోర్టు మాస్టర్ డిబి షాజీ వచ్చారు. స్వాగతం పలికిన వారిలో విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కె రెడ్డి, ప్రోటోకాల్ అధికారి జవహర్, లైజన్ అధికారి కిరణ్మయి, గుడివాడ ఆర్‌డిఒ పి.పద్మావతి, డిఎస్‌పి జయసూర్య, సిఎస్‌ఓ వెంకటరత్నం, గన్నవరం తహశీల్దారు పవన్ కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం కమిషన్ బృందం రోడ్డుమార్గంలో విజయవాడకు బయలుదేరి వెళ్లింది.

నేడు కేసుల బహిరంగ విచారణ

ఈ బృందం బుధవారం ఉదయం 10.30 నుండి 12.30 గంటల వరకు క్యాంప్ సిట్టింగ్‌లో కేసుల బహిరంగ విచారణ జరుపుతుంది. మధ్యాహ్నం 12.30 నుండి 01.30 గంటల వరకు రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమవుతుంది. 2.30 నుండి 3.30 గంటల వరకు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ పౌర సమాజ సంస్థలు (సిఎస్‌వోలు), స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ (హెచ్‌ఆర్‌డీ) లతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటుంది. 3.30 నుండి 4 గంటల వరకు పాత్రికేయుల సమావేశం నిర్వహిస్తుంది. ఇందుకుగాను నగరంలోని లబ్బీపేట పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.



జస్టిస్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

రక్షణ మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : ఏలూరు పర్యటనకు వెళ్లేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాధ్ సింగ్ మంగళవారం విశాఖపట్నం నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు కష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజ్‌నాథ్‌సింగ్ రోడ్డు మార్గంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్లారు.

రక్షణ మంత్రికి స్వాగతం పలుకుతున్న కృష్ణాజిల్లా జెసి గీతాంజలి శర్మ



ఆగిన డైట్ బిల్లులు

- మూడు మాసాలుగా పెండింగ్
- అగమ్య గోచరంగా హాస్టళ్ల నిర్వహణ

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్ ఛార్జీలను సక్రమంగా మంజూరు చేయడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. నెలనెలా విడుదల చేసి వసతి గృహాల్లో చదువుతున్న పేద వర్గాల పిల్లలకు బలవర్థకమైన ఆహారాన్ని అందించడంలో నిర్లక్షంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వసతి గృహాల నిర్వహణ కష్టంగా మారింది. హాస్టళ్లను పర్యవేక్షించే వార్డన్లు, ఇతర అధికారులు వారి చేతి డబ్బులు వేసుకొని, అప్పులు చేసి నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థిక భారం అధికమవుతుండటంతో మెనూ ప్రకారం ఆహారం అందించడం ఇబ్బందికరంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా నాలుగు డివిజన్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. జగ్గయ్యపేట ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని వసతి గృహాల విద్యార్థులకు అక్టోబర్ వరకు బిల్లులు చెల్లించారు. నవంబరు నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. నందిగామ ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని వసతి గృహాలకు నవంబరు వరకు బిల్లులు పాస్‌చేయగా డిసెంబరు, జనవరి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. విజయవాడ ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని వసతి గృహాలకు నవంబరు వరకు బిల్లులు చెల్లించగా, డిసెంబరు, జనవరి బిల్లులు చెల్లింపులకు నోచుకోలేదు. తిరువూరు ఏఎస్‌డబ్ల్యూ పరిధిలో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. సెప్టెంబరు వరకే బిల్లులు పాసయ్యాయి. అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ సిఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయడం కూడా పెద్ద సమస్యగా మారింది. సిఎఫ్‌ఎంఎస్ వీటిని తీసుకోలేదు. బిల్లులు అప్‌లోడ్ చేసినా నిధులు మంజూరు కాలేదు. బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారనేది ప్రశ్నార్థకంగా



మారింది. జిల్లావ్యాప్తంగా 38 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిల్లో 25 ప్రీమెట్రిక్ వసతి గృహాలు, 13 కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 1400 మంది పిల్లలు చదువుకుంటున్నారు. వీరిలో మూడో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న వారే 1250 మంది వరకు ఉన్నారు. పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో ఇంత కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులున్నారు. అయితే మూడు, నాలుగు తరగతుల పిల్లలకు నెలకు రూ.1150, ఐదో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నెలకు రూ.1400, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు నెలకు రూ.1600 చెల్లించాల్సి ఉంది. కానీ గత మూడు మాసాలుగా బిల్లులు ఆగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పైగా ఇప్పుడు ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. త్వరలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు మొదలు కానున్నాయి. ఈనేపథ్యంలో వసతి గృహాల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది.

67 శాతం ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరగపాలక సంస్థ పరిధిలో గడిచిన ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటికి 67 శాతం ఆస్తి పన్ను వసూలైంది. ప్రాపర్టీ టాక్స్ (ఆస్తి పన్ను), వాటర్, డ్రైనేజి, ఖాళీ స్థలాలు, వాటర్ మీటర్లు కనెక్షన్లన్నింటిపై ఛార్జీల మొత్తం డిమాండ్ (కరెంట్+ఎరియర్స్) రూ.500 కోట్లకుగాను కలెక్షన్ రూ.180 కోట్లు మేర వసూలైంది. ప్రాపర్టీ టాక్స్ డిమాండ్ రూ.180 కోట్లకుగాను రూ.125 కోట్లు వసూలైంది. నగర పరిధిలోని 1,18,201 వాటర్ కనెక్షన్ల ద్వారా రూ.62 కోట్లు రావాల్సి ఉండగా, రూ.22 కోట్లు వసూలైంది. అలాగే లక్షా ఐదు వేల 201 డ్రైనేజీ కనెక్షన్ల ద్వారా రూ.39 కోట్లు రావాల్సి ఉండగా, రూ.13 కోట్లు వసూలు చేశారు. అలాగే 15,308 ఖాళీ స్థలాల నుంచి రూ.203 కోట్లు రావాల్సిఉండగా, 14 కోట్లు వసూలైంది. 10,611 వాటర్ మీటర్ల కనెక్షన్ల ద్వారా రూ.20 కోట్లు రావాల్సి ఉండగా, రూ.9.50 కోట్లు వసూలైంది. మార్చి గడచిన ఐదు రోజులకు రోజుకు కోటిన్నర చొప్పున వసూలైనట్లు డిసిఆర్ జి.సృజన తెలిపారు.

పాలకుల అసమర్థతకు నిదర్శనం గుణదల ఫ్లైవోవర్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : పదిహేనేళ్లుగా గుణదల ఫ్లైవోవర్ బ్రిడ్జి మొండి గోడలతో దర్శనమిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వైసిపి, టిడిపి ప్రజా ప్రతినిధుల అసమర్థతకు నిదర్శమన్నారు. ఫ్లైవోవర్‌కు నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని, కాల్వగట్ల వాసులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 7న సిపిఎం ఆధ్వర్యాన నిరసన దీక్ష జరగనున్న నేపథ్యంలో మంగళవారం గుణదలలో ఆ పార్టీ నేతలు పాదయాత్ర నిర్వహించారు. ఒకటవ డివిజన్ కాల్వ కట్టలపై జరిగిన ఈ పాదయాత్రలో నేతలు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గతంలో అధికారంలో ఉన్న టిడిపి, నేడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వాల నిర్లక్ష్యంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కాల్వకట్ల ప్రజలను వైసిపి, టిడిపి నేతలు మోసం చేశారని విమర్శించారు. గత పదిహేనేళ్లలో మూడు ప్రభుత్వాలు, ఐదుగురు ముఖ్యమంత్రులు మారారని గుర్తుచేశారు. నగరంలో ఒక బ్రిడ్జి కట్టలేని అసమర్థ పార్టీలు నగరాన్ని, రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం సుందరీకరణ పేరులో కాల్వగట్లపై పేదల ఇళ్లను తొలగించేందుకు పూనుకుందన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

ప్రజా ప్రతిఘటనతో ఇళ్ల తొలగింపు నిలిచిపోయిందన్నారు. కాల్వగట్లవాసులకు పట్టాలిస్తామని వైసిపి నమ్మించి మోసం చేసిందన్నారు. టిడిపి బాటలోనే పలు ప్రాంతాల్లో కాల్వగట్ల ఇళ్లను వైసిపి ప్రభుత్వం తొలగించిందన్నారున. కష్ణా నది రెటైనింగ్ వాల్ కట్టామని గొప్పగా చెప్పుకుంటున్న వైసిపి...కాల్వగట్లపై రిటైనింగ్ వాల్ ఎందుకు కట్టడం లేదని ప్రశ్నించారు. గుణదల సెంటర్‌లోని మూడు వంతెనలు కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. వంతెనలు ఇరుకుగా ఉండడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని వివరించారు. ఈ పాదయాత్రలో బి రమణరావు, కోటా కళ్యాణ్, బోయి సత్యబాబు, షకీలా, ప్రసన్న, మస్తాన్, బాషా, అజయ్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక సెంటర్‌లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తీసుకో వాల్సిన జాగ్ర త్తలపై ఎస్‌ఐ జి.రామ కృష్ణ వాహన దారులకు అవగాహన కల్పించారు. మంగళ వారం ఈమేరకు ప్రయాణికులతో ఆయన మాట్లాడుతూ ప్రయాణించేటప్పుడు సరైన పత్రాలు లేకుండా, అధిక వేగంతో వెళ్ళటం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.



పుస్తకావిష్కరణలో యుటిఎఫ్ నాయకులు

'మన ఓటు మన భవిష్యత్తు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - విసన్నపేట : యుటిఎఫ్ రాష్ట్ర శాఖ రూపొందించిన మన ఓటు మన భవిష్యత్తు కార్యక్రమం విసన్నపేట యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బిహెచ్‌వి.సూర్యనారాయణ మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేసే వరకు యుటిఎఫ్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకష్ణారెడ్డి విస్సన్నపేట మండల శాఖ అధ్యక్షులు కె.చైతన్య యుటిఎఫ్ మండల నాయకులు పిరవి, ఆర్.శ్రీనివాసరావు, ఎ.మురళి, డి.రాంబాబు, కె.రంగా, వెంకటేశ్వరరావు, ఇ.నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మైలవరం : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వాహనదారుడికి తీవ్రగాయాలైన ఘటన మైలవరంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చంద్రగూడెం గ్రామానికి చెందిన సంగు రాంబాబు (46) చంద్రగూడెం నుండి ద్విచక్రవాహనంపై మైలవరం వస్తున్నాడు. తిరువూరు రోడ్‌లోని పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుండి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో రాం బాబు ఒక్కసారిగా పైకి ఎగిరి కింద పడ్డాడు. దీంతో రాంబాబు తలకు తీవ్రగాయమైంది. అతని బైకు సమీపంలోని ఒక ఇంట్లోకి దూసుకు పోయిం ది. చుట్టుపక్కల వారుగమనించి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడు రాంబాబును 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైకును ఢీకొన్న కారు ఆపకుండా వెళ్ళటంతో కొంతమంది స్థానికులు వెంబడించి కారును ఆపి మైలవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

విఎంసి నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ సదవకాశాన్ని వినియోగించుకొని నిర్దేశించి గడువులోగా పన్నుల మొత్తాన్ని చెల్లించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుంఢ్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై విధించి ఉన్న వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. ఈ నెల 31 లోపులో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ఇతర పన్నులు మొత్తం చెల్లించినట్లయితే వడ్డీ మినహాయింపు వర్తించడంతో పాటు...ఇప్పటికే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వడ్డీతో చెల్లించినట్లయితే సదరు వడ్డీని 2024-25 ఆర్థిక సంవత్సరపు ఆస్తి పన్నుకు జమ చేయబడుతుందని కమిషనర్ తెలిపారు. మూడు సర్కిల్స్ పరిధిలోని క్యాష్ కౌంటర్లు పని దినాలతోపాటు సెలవు రోజుల్లో కూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పని చేస్తాయని, నగర వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పదిలో అధిక మార్కులు సాధించాలి

ఎస్ఎఫ్ఐ మోడల్ పరీక్షలో చందర్లపాడు ఎంఇఒ శ్యాంబాబు



విద్యార్థులకు బహుమతులిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - చందర్లపాడు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అధిక మార్కులు సాధించిన వారికి బహుమతుల ప్రదానోత్సవం మంగళవారం నిర్వహించారు. స్కూల్‌ఫస్ట్, సెకండ్, బహుమతులిచ్చారు. ఈ సందర్భంగా చందర్లపాడు ఎంఇఒ శ్యాంబాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మార్చి18 నుంచి జరుగుతున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలని ఆయన విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకు వెళ్లాలని విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షలో విజేతగా నిలిచిన విద్యార్థులు రానున్న రోజుల్లో చదువులో ముందుకు వెళ్లాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ అధ్యక్షులు పాటి రవికుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని అన్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్య ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు తమకు తామే పోటీగా భావించి ఒత్తిడిలేని విద్యను చదవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సమస్యల మీద పోరాటమే కాకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం రోహిణి, అజయ్, గౌతమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహనకు పోలీసుల కవాతు



తిరువూరు



పెనుగంచిప్రోలు

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీస్ వారికి ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక ఎస్ఐ రాంబాబు, చిల్లకల్లు ఎస్ఐ కిషోర్ కోరారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా ఆదేశాలు మేరకు ఎసిపి రవికిరణ్ పర్యవేక్షణలో మంగళవారం పెనుగంచిప్రోలు, శివాపురం, అనిగండలపాడులో సిఆర్‌పిఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శాంతి భద్రతలు పరిరక్షణకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళేందుకు పోలీసులు సహకరిస్తామని ఆ రకమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఎవరు కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని గొడవలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా గొడవలు సృష్టించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు. **తిరువూరు :** త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ధైర్యం కల్పించేందుకే కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు మైలవరం ఎసిపి ఎస్.మురళీ మోహన్ అన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి తిరువూరు పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. విజయవాడ సిపి క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు మైలవరం ఎసిపి ఎస్.మురళీ మోహన్ ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాక్టరీ సెంటర్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా తిరువూరు పోలీస్‌స్టేషన్ వరకు సాయుధ జవాన్లు కవాతు జరిపారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసులు ఎల్లప్పుడు ప్రజలందరికీ తోడుగా ఉంటారనే ధైర్యాన్ని కల్పించడానికి ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ సూచించారు. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, సెక్టార్- 1 ఎస్సై సత్యనారాయణ పర్యవేక్షించారు.

కార్మికుల కోసం సఫాయి మిత్ర యాప్

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎం.డి. గంధంచంద్రుడు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలోని సఫాయి కార్మికులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలనుఅందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సఫాయి మిత్రయాప్ దోహదపడుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గంధం చంద్రుడు అన్నారు. మంగళవారం విజయవాడలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సఫాయి మిత్ర సర్వేయాప్ ను గంధం చంద్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, గ్రామపంచాయితీల పరిధిలో పనిచేస్తున్న సఫాయి కార్మికుల సేవలు అజరామరమని కొనియాడారు. సఫాయి కార్మికుల జీవనోపాధిని పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో పని చేసే సఫాయికార్మికుల గుర్తింపు ప్రక్రియలో భాగంగానే ఈ సఫాయి మిత్ర సర్వే యాప్‌ను ప్రారంభించామని తెలిపారు. సఫాయికార్మికులకు అత్యవసరసేవలను అందించేందుకు కనీస వేతనాలు నిర్ధారించడంతో పాటుఅధిక ప్రమాదం ఉన్న కార్మికుల ఆరోగ్య భద్రతను మెరుగుపరచడానికి ఈ యాప్ ఎంతగానో ఉపకరిస్తుందని గంధం చంద్రుడు తెలిపారు.

216వ రోజు రాజన్న ఉచిత భోజనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో నిరంతరం జరిగేలా రాజన్న ఉచిత భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, వారి సతీమణి సామినేని విమలభాను ప్రారంభించారు. నియోజకవర్గం నుండి పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన వ్యాపారస్తులు, వివిధ వృత్తుల వారు, ఉద్యోగస్తులు, విద్యార్థులు పట్టణానికి చెందిన నిరుపేదలు, అనాథ వృద్ధులు, నిరాశ్రయులు మంగళవారం 1,600 మందికి పైగా రాజన్న ఉచిత భోజనం చేశారు.

టిడిపి మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ టిడిపి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కంచికచర్ల రైతు బజార్ రోడ్డు, హనుమాన్ పేటలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, మాజీ ఎంపిపి అల్లాడి కోటేశ్వరరావు నాయకులు గుత్తా రత్నం, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసారెడ్డి



ప్రజాశక్తి - తిరువూరు : టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడుగా గంపలగూడెం మండలం కనుమూరు గ్రామానికి చెందిన ఉప్పెల నరసారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం నియామక ఉత్తర్వులను మంగళ వారం నర్సారెడ్డికి అందజేశారు.

జిల్లా మహిళా విభాగం జాయింట్ సెక్రెటరీ నియామకం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళా దారా సూర్యకళ్ల రాజాను ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం జాయింట్ సెక్రెటరీగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ ఆదేశాల మేరకు మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.లక్ష్మీ నియమించినట్టు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆమెను వాసవి కపుల్స్ క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సోమేశ్వరరావు, పేరూరి నరసింహారావు, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షురాలు వాసా నాగమణి, కె.శోభారాణి కొండ అభినందించారు.

పలువురికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 1 వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 50 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి కె.సురేష్ బాబు జైలు, జరిమానా విధించారు. ఒక వ్యక్తికి 10 రోజులు జైలు శిక్షతో పాటురూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 8 రోజులు జైలు, రూ.10వేలు, ఒక వ్యక్తికి 7 రోజులు జైలు, రూ.10వేలు జరిమానా, ఇద్దరికి ఒక్కొక్కరికి 6 రోజులు జైలు, రూ.10 వేలు, నలుగురికి ఒక్కొక్కరికి 5 రోజులు జైలు, రూ.10వేలు, ఇద్దరికి ఒక్కొక్కరికి 4 రోజులు జైలు, రూ.10వేలు, నలుగురికి ఒక్కొక్కరికి 03 రోజులు జైలు, రూ.10 జైలు జరిమానా, ఏడుగురికి ఒక్కొక్కరికి 2 రోజులు జైలు, రూ.10వేలు, 13 మందికి 1 రోజు జైలు, రూ.10 వేలు, మిగిలిన 15 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని బండిపాలెం గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వీరికి ఉదయభాను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

లయన్స్ క్లబ్ చల్లపల్లి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-చల్లపల్లి : లయన్స్ క్లబ్ ప్రపంచ దేశాల్లో విస్తృత సేవలు చేస్తోందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ జె.ఎన్.శంకర గుప్తా అన్నారు. మంగళవారం చల్లపల్లి లోని క్లబ్ కార్యాలయంలో జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన, సమావేశం జరిగాయి. ఈ సందర్భంగా శంకరగుప్తా మాట్లాడుతూ క్రమశిక్షణ, ప్రణాళికతో క్రమంతప్పకుండా సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీ.ఆర్.కే నగర్ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మోపిదేవి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాయపాటి రాధాకష్ణ, క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు, తగిరిశ సాంబశివరావు, ఎస్.జీ.ఏ బాషా, కోసూరు శివాజీ, కొల్లిపర మధు, ఎంవీ కష్ణారావు, అడపా గురవయ్య పాల్గొన్నారు.

చెన్నూరులో ప్రజా దీవెన

ప్రజాశక్తి-పెడన : మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, నియోజకవర్గ వైకాపా శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము ప్రజా దీవెన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఓట్లను మంగళవారం అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

9న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నగరంలోని అజిత్‌సింగ్ నగర్‌లో గల మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈనెల 9వ తేదీ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ఫౌండేషన్ అధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన వైద్య పరికరాలతో నిర్వహించే వైద్య శిబిరంలో శుక్లాలు సహా కంటికి సంబంధించిన అన్ని దృష్టి దోషాలు పరీక్షించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ ఇస్తామని తెలిపారు. కాలం చెల్లిన కళ్లజోళ్లు వాడుతూ కంటి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్న వారిని గుర్తించి తగిన సూచనలు అందిస్తామని తెలిపారు.

నేడు ఆదాయ పన్నుపై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 6వ తేదీ సాయంత్రం 4.15 గంటలకు ఛాంబర్ కార్యాలయంలో ఆదాయ పన్నుపై అవగాహనా సదస్సు నిర్వహించ నున్నట్లు విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఎల్.ఎన్. వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా పాల్గొంటారని తెలిపారు.

ఎపిఎస్ఎస్‌డిసి నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని పాలి టెక్నిక్ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఎపిఎస్-ఎస్‌డిసి (స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్) భవనం ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ భవనాన్ని ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ధాన్యం నగదు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ప్రభుత్వం నుండి రైతులకు రావలసిన ధాన్యం డబ్బులను ఇప్పించాలని తహశీల్దార్ కుసుమ కుమారికి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సేలం ప్రకాష్ రావా ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. వీరంకి శ్రీనివాసరావు కె.సాం బయ్య, జి రమేష్, చింతకుంట రాజారావు, తదితర రైతులు తమ గోడును తాసిల్దార్ కు విన్నవించుకున్నారు. గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలో కురిసిన కాల వర్షాలకు రైతులు కుదేలయ్యారని, పంటలు నష్టపోయి ప్రత్యా మ్నాయ పంటలు వేసుకున్నప్పటికీ అనేక కష్టనష్టాలకు ఓడ్చి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేసిన పంటకు సైతం దాన్యం డబ్బులు ఇంత వరకు ప్రభుత్వం వేయకపోవడంపై రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు ధాన్యం డబ్బులను విడుదల చేసి తమ ఖాతాల్లో జమ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగ స్వామ్యం కావాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కోరారు .మంగళవారం ఆయన కలెక్టరేట్లోని ఆర్డిఓ కార్యాలయం వద్ద జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఓటు వినియోగంపై అవగాహన ప్రచార వాహనాన్ని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఎన్నికల ఈ ప్రచార వాహన ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ వాహనంలో ఓటర్లను చైతన్యపరిచే వీడియోలు, పోస్టర్లు ఉంటాయని, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శిస్తూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజలను చైతన్యవంతం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, బందరు ఆర్డిఓ ఎం వాణి, తహసిల్దార్ పి.సతీష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

నేడు ఎంబివికెలో మహిళా సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం నాలుగో అంతస్తులో వివిధ సంఘాల ఆధ్వర్యాన "చట్ట సభల్లో రిజర్వేషన్లు, ఆర్థిక, సామాజిక సమానత్వం, అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి లక్ష్యాలు" అన్న అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ సంయుక్త ఆధ్వర్యాన ఈ సదస్సు జరుగుతుంది. రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షులు సాధు విఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కె.ఉషారాణి ముఖ్య అతిథిగా, ఇన్నర్ వీల్ మిడ్‌టౌన్ అధ్యక్షులు కె.హరిత చౌదరి, దివాస్ అధ్యక్షులు వై.స్వరూప, రోటరీ మిడ్‌టౌన్ కార్యదర్శి జి.వి.ఎస్.సందీప్, ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి, పి.విజయ వక్తలుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ ఎన్.విద్యాకన్నా, న్యాయవాది కోనేరు జయప్రద, ఫ్యాషన్ డిజైనర్ సమాన హుస్సేని, ఆర్టిస్ట్ మేడా రజిని సన్మానిస్తారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహిళా సమస్యలపై పాటలు, జానపద నృత్యాలు, లఘు చిత్రాల ప్రదర్శనలు ఉంటాయి.



సచివాలయం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొడాలి నాని

సచివాలయం,ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కౌతవరం గ్రామంలో ఎమ్మెల్యే కొడాలి నాని మంగళవారం రూ.61.80 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన సాతులూరి అవినాష్ అనే యువకుడికి ఎమ్మెల్యే కొడాలి నాని 3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపీ కొడాలి సురేష్,మండల వైసీపీ కన్వీనర్ సాయన రవి, కౌతవరం పిఎసిఎస్ డైరెక్టర్ వడ్లమూడి చిన్ని,కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ పడమట సుజాత ఎంపీటీసీలు ఈడే లక్ష్మి, చీర దుర్గాభవాని పాల్గొన్నారు.



పెదబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దబాబు మృతికి నివాళి

ప్రజాశక్తి-కంకిపాడు : మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో సీఐటీయూ కంకిపాడు మండల అధ్యక్షురాలు ఎం రజిని భర్త ఎం. పెద్దబాబు(50) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. పెదబాబు భౌతికకాయాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, కష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రవి, ఎం వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఏ కమల, ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం కష్ణా జిల్లా అధ్యక్షురాలు జి చిట్టి కుమారి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, పెనమలూరు మండల కార్యదర్శి త్రిమూర్తులు, సిఐటియు ఉయ్యూరు మండల కార్యదర్శి బి రాజేష్, సిపిఎం కంకిపాడు మండల కమిటీ సభ్యులు వి జాన్ మోజేష్, జే. రవి సిఐటియు కంకిపాడు మండల కమిటీ సభ్యులు మురళీమోహన్‌లు పెదబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గోపాలకృష్ణ మృతికి సంతాపం

ప్రజాశక్తి మోపిదేవి : దివిసీమ సర్వోదయ సహాయక సమితి అధ్యక్షులు శ్రీ కోసూరు గోపాలకృష్ణ మూర్తి (గాంధీ) మరణం పట్ల మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఖాదీ ఉద్యమంలో రాష్ట్ర స్థాయిలో దివిసీమ ఖ్యాతిని చాటారని, తన తండ్రి మండలి వెంకట కృష్ణారావుకి అత్యంత సన్నిహిత సహచరుడిగా గోపాలకష్ణమూర్తి ఉండేవారని, నిరాడంబర జీవితం గడిపారని బుద్ధప్రసాద్ అన్నారు. వారు నిర్మించిన ఖాదీ భవన్ ని అప్పటి గవర్నర్ కుముద్ బెన్ జోషి ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయన అకాల మత్యువు పొందడంతో సోమవారం కోసూరివారిపాలెం గ్రామంలోని గోపాలకష్ణమూర్తి స్వగహానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కేంద్ర బలగాలు కవాతు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలోని 2టౌన్ పరిధిలో మంగళవారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డియస్‌పి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయన్నారు. గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో సిఐఎస్ఎఫ్ 287 విభాగానికి చెందిన 92 మందిని కేటాయించారన్నారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను కేంద్ర బలగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాయన్నారు. కవాతులో సిఐ దుర్గారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్:** ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా ప్రజలు, రాజకీయపార్టీలు సహకరించాలని సీఐ నరసింహమూర్తి కోరారు.బాపులపాడు మండలం వేలేరు, రేమల్లె, సింగన్నగూడెం, రంగన్నగూడెం, వీరవల్లి గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలతో(సీఆర్పీఎఫ్) కలిసి ఫ్లాగ్మర్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని, సమస్యాత్మక గ్రామాలతో పాటు వ్యక్తుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, వీరవల్లి ఎస్సై చిరంజీవి, హనుమాన్జ0క్షన్ ఎస్సైలు జనార్ధన్ అర్జమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

వైభవంగా వీరమ్మతల్లి వసంతోత్సవం



ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మతల్లి వసంతోత్సవ వేడుక మంగళవారం వైభవంగా నిర్వహించారు. పదిహేను రోజుల తిరునాళ్ళ అనంతరం తెల్లవారుఝామున ప్రధాన రహదారిపై ఉన్న ఆలయం నుంచి బయలు దేరిన అమ్మవారు డప్పువాయిద్యాల నడుమ భక్తులు తోడురాగా ఊ రేగుతూ ఉదయం రావిచెట్టు సెంటర్ సమీపాన ఉన్న మెట్టినింటికి చేరుకోగా పారుపూడి వంశస్తుల ఆడపడు చులతో పాటు పలువురు మహిళలు నీటిబిందెలతో స్వాగతం పలికి ఆనందోత్సాహాలతో వసంతోత్సవం నిర్వహిం చారు. మెట్టి నింటికి చేరుకున్న అమ్మవారు శివరాత్రి రోజున తోట్లవల్లూరు మండల పరిధి కష్ణానదీ పాయలో పవిత్ర స్నానమాచరించి తిరిగి మేళతాళాలతో మెట్టినింటికి చేరుకుంటారు.

అలరించిన నత్యాలు : వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ఎంకె డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చిన్నా రులు నిర్వహించిన నృత్యాలు అందరిని అలరించాయి. తిరునాళ్లలో పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిం చగా ఎంకె డ్యాన్స్ అకాడమి విద్యార్థు లు ప్రదర్శించిన వీరమ్మ తల్లి చరిత్ర, జానపద నత్యాలు భక్తులను కేరింతలు కొట్టించాయి. విద్యతోపాటు సంస్కతి, సాంప్రదాయాలు అలవరుచుకునేలా పలు కార్యక్ర మాలు చేస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ ఎంకె బాబు వివరించారు.

47వ డివిజన్‌లో ఆసిఫ్ ప్రచారం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గ 47.డివి జన్ కార్పొరేటర్ గోదావరి గంగా బాబు ఆధ్వర్యంలో మంగళ వారం పశ్చిమ నియోజకవర్గం గడప గడపకు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ వైసిపి సమన్వయకర్త ఎంఎల్‌ఎ అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాగేంద్ర పుణ్యశీల గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, రాష్ట్రచైర్మన్లు రాష్ట్ర డైరెక్టర్లు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులు డివిజన్ అధ్యక్షులు పెద్దలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని, ప్రజా సమస్యలు తెలుసుకుని సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

గాంధీ హిల్ అవుట్‌ఫాల్ డ్రైన్ పరిశీలన



ప్రజాశక్తి - వన్‌టౌన్ : 53వ డివిజన్‌లో గల గాంధీ హిల్ ఔట్ఫాల్ డ్రైన్‌కు సంబంధించి, కాల్వలో పేరుకు పోతున్న చెత్త, మురుగునీటి పారుదలకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం విఎంసి అధికారులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీరావు పర్యటించారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవలసిన చర్యల గురించి కృష్ణవేణి మార్కెట్ వద్ద డ్రైన్, డ్రైన్ వీధి, జండా చెట్టువద్ద డ్రైన్, గాంధీజీ యూజీడి పంపింగ్ స్టేషన్, గాంధీహిల్ దగ్గర డ్రైన్, వెహికల్ డిపో వద్ద పంపింగ్ స్టేషన్ పరిశీలించారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు హెల్త్ సెక్షన్ అధికారులకు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రాజెక్ట్ విభాగం వారు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు కూడా చెత్తను కాల్వల్లో, రోడ్డుపై చెత్త వేయకుండా పారిశుధ్య సిబ్బందికి మాత్రమే అందరూ అందచేయాలని కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ స్థానికుల ను కోరారు. ఈ పర్యటనలో సర్కిల్ 1 జోనల్ కమిషనర్ కీర్తన, ఏఎంఒహెచ్ సురేష్, ప్రాజెక్ట్స్ ఎఇ బూసిరెడ్డి, ఇంజనీరింగ్ ఎఇ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్లు గుర్రం శ్రీను, దుర్గారావు, జానికిరాం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు బోయి సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మున్సిపల్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిపిఎం కార్పొరేటర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బోయి సత్యబాబు అన్నారు. మంగళవారం సర్కిల్ వన్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడారు. సమ్మె కాలం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని, వారాంతపు సెలవు అమలు చేయాలన్నారు. మున్సిఫల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు కొండా, లక్ష్మీ, విజయలక్ష్మీ. శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న బోయి సత్యబాబు

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదవారి గుండెల్లో గూడు కట్టుకున్నారని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 లక్షల పేదవారికి పట్టాలిచ్చి ఇల్లు కట్టించి వారి ఆత్మ గౌరవాన్ని పెంచారన్నారు. పట్టాలివ్వటమే కాకుండా ప్రభుత్వ ఖర్చుతో రిజిస్ట్రేషన్లు చేయించి దేశంలోనే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పట్టాలిచ్చి ఇళ్లు కట్టించి రిజిస్ట్రేషన్ చేయించి పేదలకు ఆ ఇంటి పై సంపూర్ణ హక్కును కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, ఎంపిపి ఇస్లావతు ప్రసన్న రాణి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ గంగాధర్‌రావు, ఎంపిడిఒ పి.శ్రీనివాస్, వైసీపీ పట్టణ అధ్యక్షులు పాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ఇళ్ళ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్‌పి కేశినేని నాని మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్నాల తిరుపతిరావు ఇళ్ల పట్టాలు లబ్దిదారులకు పట్టాలందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పేదవారు ఎవరు సొంత ఇల్లు లేని వారు ఉండకూడదని సిఎం జగన్ అర్హులందరికీ ఇళ్లపట్టాలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అధికారులు, కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీ రిజిస్ట్రేషన్ పట్టాలను విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని నాని పంపిణీ చేశారు. వైసిపి మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సర్నాల తిరుపతిరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు నాని మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల స్థలాలిచ్చినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ పట్టాలివ్వడం దేశంలోనే ఒక రికార్డు అన్నారు. ఒక ఇంటి స్థలం ఖరీదు ఇప్పుడు రెండు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, సచివాలయ కన్వీనర్ భరత్ కుమార్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో పట్టాలిస్తూ...



రెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎంపి నాని

స్లైస్ మామిడి పండ్ల రసాల ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మామిడి పండ్ల ప్రియులకు చక్కటి పానీయంగా తీసుకువచ్చిన స్లైస్ సరికొత్త రుచులతో తీసుకువచ్చినట్లు స్లైస్ అండ్ ట్రోపికానా అసోసి యేషన్ డైరెక్టర్ అనూజ్ గోయల్ తెలిపారు. మంగళ వారం నగరంలోని ఓహోటల్‌లో స్లైస్ పండ్ల రసాల ఉత్పత్తులను ఆయన ఆవిష్కరించారు. అనం తరం మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రతి ఒక్కరికీ మంచి రుచులను అందించాలనే ఉద్దేశంతో నూతన ఉత్పత్తులను పరిచయం చేస్తున్నామని, స్లైస్ పానీయం బ్రాండ్‌కు ప్రచారకర్తగా నయనతార వ్యవహరించనుందని తెలిపారు. ఈ వేసవి సందర్భంగా రుచులను అందరచికి చేరవేసే విధంగా నూతన ప్రచారంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు.

హనుమంతరావుకు పురస్కారం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట: తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన మేఘన సాహితీ కళా వేదిక అధ్యక్షులు ఈర్ల సమ్మయ్య రూపొందించిన నూతన తెలుగు సాహిత్య లఘు కవిత ప్రక్రియలో మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన యువకవి లింగనబోయిన హనుమంతరావు 108కి పైన మధురిమలు రచించినందుకు గానూ మధుర కవిభూషణ పురస్కారాన్ని వాట్సాప్ వేదికగా అందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సంబంధించిన విషయాలను అవగాహన కల్పించారు. శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రిసెల్వి.కె ఎన్టీఆర్ వారి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. బాల్యవివాహాలు, బాలలపై లైంగి క వేధింపులను అరికట్టడం, సమాన అవకా శాలు - సమాన అధికారాలు, మహిళల ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తూ మనస్వినీ మనసు తో వీని సామూహిక చర్చల ద్వారా మహి ళల సమస్యలను కౌన్సిలిం గ్ ద్వారా అరికట్టడం 'బేటీ బచావో - బేటీ పఢావో' గర్భస్థ ఆడశిశువులను కాపాడుదాం బంగారు సమాజాన్ని నిర్మిద్దాం ఆడపిల్లల్ని బతికించు ఆడపిల్లల్ని చదివించు అనే నినాదాన్ని ప్రచురించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో శైలజ జి.ఉమా దేవి, డిసిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ ప్రాంగణంలో గల శ్రీ భూ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారి 31 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవంలో విఎస్‌పి రిటైర్డ్ ఉద్యోగ ప్రముఖులు విజయవాడకు చెందిన బి.భీమరాజు, దుర్గ దంపతులు పాల్గొని స్వామి వారి కళ్యాణ మహోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు టిఎల్ఎన్ ఆచార్యులు (మూర్తి) ఆధ్వర్యంలో తిరునగరి జానకిరామ్ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన తదితర కళ్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెఎల్‌ఎం ఇన్చార్జ్ బియువిఎన్.రాజు దంపతులు, విఎస్‌పి ఉద్యోగ ప్రముఖులు పిఆర్‌కె.రాజు, జెవి.ఎస్.డి.ప్రసాద్, హరికృష్ణ, వి.ఆంజనేయులు తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.



ఎన్‌ఆర్‌ఐల సహకారంతో

రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని వెల్వడం గ్రామంలో ఉన్న బాల కోటేశ్వర స్వామి (శివాలయం) యాత్రికుల కష్టాలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. స్వామి కల్యాణాన్ని, తిరునాళ్ల సందర్భంగా లక్షలాదిమంది హాజరయ్యే ఈ దేవాలయానికి వెల్వడం గ్రామం నుండి సరైన రహదారి లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారు. ప్రవాస భారతీయులు కుడుముల కోటారెడ్డి దంపతులు, మైలవరం గ్రామంలో గత 25 సంవత్సరాలుగా బంగారు నగల వ్యాపారం చేస్తున్న బయన శ్రీనివాసరావు దంపతులు రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా తారు రోడ్డు నిర్మాణం చేయించారు. ఈ రోడ్డును మంగళవారం ప్రవాస భారతీయులు లకిరెడ్డి సోదరులు డాక్టర్.హనిమిరెడ్డి, జయప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. రూ.20 లక్షలకు పైగా వెచ్చించి దేవాలయం పరిసర ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిరోడ్డును చదును చేయించారు. రూ.12లక్షల వ్యయంతో యరమల సత్యనారాయణ రెడ్డి అఖండ హారతి మండపాన్ని నిర్మించారు. రూ.10 లక్షల వ్యయంతో లకిరెడ్డి పుల్లారెడ్డి, కుడుముల తిరుపతిరెడ్డి టాయిలెట్లను నిర్మించారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ప్రవాస భారతీయులు సిద్ధార్థ రెడ్డి, దుంప వెంకటేశ్వర రెడ్డి, ఎల్.బి.ఆర్.సి.ఇ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, యరమల రాంభూపాల్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వెల్వడంలో రహదారిని ప్రారంభిస్తున్న అనిమిరెడ్డి

టిడిపి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తిరువూరు : టిడిపి తిరువూరు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులుగా తిరువూరు పట్టణానికి చెందిన మోదుగు వెంకటేశ్వర రావు నియ మితులయ్యారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘు రాం వెంకటేశ్వరరావుకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు.



కార్మికులతో 'టెండర్' ఆటలు

- చాకిరీ ఎక్కువ.. వేతనం తక్కువ
- గన్నవరం పంచాయతీలో అధికారుల రూటే వేరు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం గ్రామ పంచాయితీలో పారిశుధ్య కార్మికుల టెండర్ల విషయంలో అధికారులు అనుసరిస్తున్న తీరు చాలా దారుణంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. టెండర్ల విషయంలో లేనిపోని నిబంధనలు పెట్టి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే వ్యవహారానికి తెరతీసిన పరిస్థితి ఉంది. టెండరు షెడ్యూలుకు సంబంధించి అధికారులు పెట్టిన నిబంధనలు పరిశీలిస్తే...2024-25 సంవత్సరానికి పిలిచారు. ప్రజారోగ్యం కార్మికులు 53 మంది, నీటిసరఫరా , వీధి దీపముల రిపేరు నిర్వహణకు 43మంది మొత్తం 96 మంది పనిచేస్తున్నారు. వీరందరి పనులకు మంగళవారం టెండర్లు వేయాల్సి వచ్చింది. అయితే కార్మికులు వేతనాలు పెంచమని అడిగినందుకు పంచాయతీ అధికారులు కొత్త నిబంధనలు సృష్టించి సంతకాలు పెట్టమని పత్రాలు ఇవ్వడంతో వాటిని చూసిన కార్మికులు విస్తు పోయారు. పత్రంలో నిబంధనలు చూస్తే జిల్లాలో ఏ పంచాయతీలో ఇటువంటి నిబంధనలు లేవని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం. పోలినాయుడు తెలిపారు. గన్నవరంలో పెట్టిన నిబంధనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. గ్రామపంచాయతీ కార్యదర్శికి ఈ కింద తెల్పిన షరతులకు లోబడి టెండరు దాఖలు చేయాలి. టెండరు డిపాజిట్టు ముందుగా రూ .500 చెల్లించవలెను.గ్రామ పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్ చెప్పిన పనులన్నింటిని చేయవలెను. ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం పంచాయితీవారు సూచించు సమయములో మాత్రమే పనిచేయవలెను. సదరు టైముకు హాజరుకాని యెడల ఆప్సెంట్ వేయబడును. ఆదివారము మరియు పండుగ రోజలలోకూడా పనికివచ్చి పని చేయవలెను. ఏరోజైనా రానియెడల సదరు రోజుకు టెండరు రేటు ప్రకారము కూలీ మినహాయింపబడును. పనిని సక్రమముగా చేయుట లేదని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పంచాయితీగాని భావించినయెడల పనినుండి తొలగించబడును. ఏవిధమైన ప్రమాదము సంభవించినచో పంచాయితీ ఎగ్జిక్యూటివ్ అధారిటీగాని, పంచాయితీగాని బాధ్యత వహించదు. నష్టపరిహారం ఇవ్వబడదు. యూనిఫారము, పాదరక్షణలు, కొబ్బరి నూనెలు తదితరాలు టెండరుదారే స్వయంగా సమకూ ర్చుకొనవలయును. పైషరతులు చదువుకున్నాను. సదరు షరతులకు లోబడి టెండరు దాఖలు చేయుచున్నాను. పైఅధికారుల అనుమతి వచ్చిన తదుపరి మాత్రమే రోజువారీ వేతనము తీసుకొనుటకు అంగీకరించుచూ, సదరు టెండరు దాఖలు చేసుకొనుచున్నాను. ఈ విధంగా పంచాయతీ అధికారులు నిబంధనలు పెట్టి కార్మికులతో సంతకాలు చేయించుకునే పరిస్థితికి వచ్చారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా నిబంధనలు పెట్టి సంతకాలు చేయించుకున్న పరిస్థితి లేదని కార్మికులు తెలిపారు. కార్మికులకు బట్టలు, నూనెలు, సబ్బులు ఇవ్వవలసిన బాధ్యత పంచాయితీదే. కానీ అవేమి తమకు సంబంధం లేదన్నట్లుగా అధికారులు నిబంధనలో పెట్టారు. కార్మికులతో పంచా యతీ పనులే కాకుండా ఇతర పనులు చేయించుకుం టున్న పరిస్థితి గన్నవరంలో ఉంది. చాలా నిర్లక్ష్యంగా ఏకపక్షంగా టెండర్లు కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని, బెదిరింపులకు దిగి పరిస్థితికి అధికారులు వచ్చారని కార్మికులు మండిపడుతున్నారు. నిజం చెప్పాలంటే కార్మికుల్లో తగాదాలు పెట్టి వారి పబ్బం గడుక్కునే పరిస్థితికి వచ్చారని, జిల్లాలో ఎక్కడా లేని నిబంధనలు పెట్టి కార్మికుల జీవితాలతో ఆటలు ఆడుతు న్నారని పోలినాయుడు మండిపడ్డారు. ఈ నిబంధనల పత్రాన్ని డిపిఓ, కలెక్టర్ దష్టికి తీసుకువెళతానని తెలిపారు.



కెయు విద్యార్థి నిషాంత్‌కు ఫెలోషిప్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగం పరిశోధనా విద్యార్థి ఎం. నిషాంత్ జాతీయ పరిశోధన ఫెలోషిప్‌కు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం నిషాంత ను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి, రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్‌బాబు అభినందించారు. ఆఫ్రికా దేశాల్లో నల్ల జాతీయులు(బ్లాక్స్) పట్ల చూపుతున్న వివక్షత పై చేసిన పోరాటానికి గాను నోబుల్ బహుమతి పొందిన టాంజానియా దేశస్థుడు అబ్దుల్ రజాక్ గున్ రహ్ పై డాక్టర్ బి. రాజు పర్యవేక్షణలో నిశాంత్ పరిశోధన చేస్తున్నాడు. ఈ కార్యక్రమంలో పరిశోధనా విభాగం సమన్వయకర్త డా ఎన్ ఉషా, పరీక్షల నియంత్రణ అధికారి డా. కిరణ్ కుమార్, సిడిసి డీన్ డా. రామ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : చేతుల్ని ఎప్పటికప్పుడు శుభ్రపరచు కోవడం ద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని ఐసిడిఎస్ సూపర్వైజర్ విశ్రాంతమ్మ సూచించారు. పోషణ అభియాన్ సంబరాల్లో భాగంగా చల్లపల్లి మండలం రామానగరంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ఆవరణలో హ్యాండ్ వాషింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ విశ్రాంతమ్మ మాట్లాడుతూ బాల బాలికలు ముఖ్యంగా కిషోర్ బాలికలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులవుతారని అన్నారు. కార్యక్రమంలో సుజాత, లక్ష్మి, సరిత, ధనలక్ష్మి, లీలావతిలతోపాటు లక్ష్మీపురం మహిళా పోలీస్ అనూష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఇస్లాంపేట చెందిన చిట్టూరి శ్యాం బాబుకు కొన్ని నెలల క్రితం అనారోగ్య కారణాలవల్ల ఒక కాలు తొలగించారు. సదరు విషయాన్ని స్థానిక నేతలు శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్ దష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1,50,000 రూపాయలను మంజూరు చేయించడం జరిగింది. మంజూరైన నగదును స్థానిక నేతలైన జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు యస్ కే. యమ్ యమ్ అబుల్ కలాం , మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కరీముల్లా , సచివాలయం కన్వీనర్ షేక్ దాదా, వైఎస్ఆర్సిపి నాయకులు యమ్ డీ. అజ్గర్ లాల్, షేక్ కరీముల్లా చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు.

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వెలివెల చిన్నబాబు కు వినతిపత్రం అందించారు. బంటుమిల్లి ఎంపీడీవో ఆఫీస్ నుండి పెందూరు హైవే వరకు రోడ్డు విస్తరణ చేయాలని, పాచ్చపురం ఆంజనేయస్వామి గుడి దగ్గర నుండి నేషనల్ హైవే వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని, పెద్దతొమ్మిడీ మురుగు కాలవ వంతెన స్థానంలో కొత్తవంతెలన నిర్మాణం చేయాలని, నిర్మాణం చేపట్టే అంతవరకు గోతులు పూడ్చాలని, నరసాపురం బెంగళూరు బస్సు బంటుమిల్లి బస్టాండ్ మీదగా వెళ్లాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పార్టీ మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్ గోష్, బొడ్డు నాగరాజు, నాగిశెట్టి కష్ణ, వంగలరాజు ఎంట్రపాటి, రాంబాబు ,పొదిలి వెంకన్న, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన



ప్రజాశక్తి కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కోడూరు మండల ప్రజలకు అందుబాటులో పబ్లిక్ హెల్త్ యూనిట్ ను మంగళవారం అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదగా శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. కోడూరు మండలం ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, అందువల్లే ఆరోగ్యశ్రీ బడ్జెట్ పెంచడం, పెన్షన్ పెంపుదల తదితరాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ తిమ్మన వెంకట నాంచారయ్య, బడే హేమ గంగాధర్, ఉల్లిపాయలు పిఎసిఎస్ చైర్మన్ కటకం కుటుంబరావు, జిల్లా రైతు భాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, కడవకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కెయులో మహిళలకు పోటీలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మహిళా దినో త్సవం సందర్భంగా కష్ణా విశ్వవిద్యాలయం లో పలు అంశాలలో పోటీలు నిర్వహించారు. విశ్వ విద్యాలయ మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యములో రంగోలి, చిత్రలేఖనం, ఫాన్సీ డ్రెస్, సోలో డాన్స్ తదితర అంశాలలో విద్యార్థినులకు, మహిళా సిబ్బందికి పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా లంకా సుశీల ఆధ్వ ర్యంలో విశ్వ విద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల లలో పోటీలు నిర్వ హించారు. విజేతలకు ఈ నెల 7 తేదీన జరిగే కార్యక్ర మంలో బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలియచేశారు.





బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా బి.ప్రకాష్ రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న బి.ప్రకాష్ రావు కృష్ణాజిల్లాకు వచ్చారు. ఇప్పటి వరకు జిల్లా అధికారిగా పని చేసిన ఫణి దుర్జేటి బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.రాజా బాబును మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం బాధ్యతలు చేపట్టారు.



అవార్డు అందుకుంటున్న అధ్యాపకులు కామరాజు

ఎస్ఆర్‌జిఇసి అధ్యాపకుడికి అవార్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మద్దు కామరాజు బోధనా పరంగా, పరిశోధనా రంగంలో నిరంతరం కృషి చేస్తూ విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల స్ఫూర్తి రగిలిస్తున్నందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ సొసైటీ నుండి అకడమిక్ టైటాన్ అచీవ్మెంట్ అవార్డు పొందారు. గత కొన్ని సంవత్సరాలుగా కళాశాలలో వివిధ స్థాయిలలో సేవలందిస్తూ ప్రస్తుతం అకడమిక్ స్ట్రెంగ్థనింగ్ అండ్ అడ్వాన్స్మెంట్ డైరెక్టర్ గా ఉన్న ప్రొఫెసర్ (డాక్టర్) మద్దు కామరాజు కు ఏ.ఐ.ఎం.ఈ.ఆర్. సొసైటీ నుండి అకడమిక్ టైటాన్ అచీవ్మెంట్ అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. విద్యా సంబంధిత విషయాల్లో సుస్థిరమైన, శ్రేష్టమైన స్మారక సాధనలు, సహకారం, సమర్ధవంతమైన అలసిపోని నిరంతర విద్యా విషయక జ్ఞానం, అన్వేషణ, ఆవిష్కరణ, విజయాలను సర్వేల ద్వారా గుర్తించి స్మారకంగా ఈ అవార్డును ప్రకటించి విషయ ధవీకరణ పత్రాన్ని ఏఐఎంఈఆర్ సొసైటీ అధ్యక్షులు డి. సాయిసతీష్ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్షా కేంద్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మంగళవారం స్థానిక లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాల సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 59 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 21,532 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు నిర్దేశించిన నియమావళి అనుసరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రా లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆర్ఐఓ పి. రవికుమార్, డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పి.బి సాల్మన్ రాజు, డిస్ట్రిక్ట్ ఎగ్జామ్స్ కమిటీ మెంబర్ ప్రసాద్ శాస్త్రి, ప్రిన్సిపాల్ కళ్యాణి కలెక్టర్ వెంట ఉన్నారు.

నిబంధనల మేరకు ఇవిఎంల వినియోగం : కలెక్టర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జిల్లాలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఈసీఐ నిబంధనలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలను ఉపయోగిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రస్తుతం వినియోగిస్తున్న మూడు ఈవీఎంలకు అదనంగా మరో మూడు ఈవీఎంలను మంగళవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గొల్లపూడిలోని ఈవీఎం గోదాము నుంచి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికలను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - చోడవరం

నాగాయలంక మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:నిల్/2024 **తేదీ: 04.03.2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం చోడవరం గ్రామ పంచాయతీ నందు 2024-25 సం॥మునకు గాను కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింద తెలిపిన పనులు చేయుటకు గాను ది.14-03-2024వ తేదీ ఉదయం గం.09-30ని॥లకు గ్రామ పంచాయతీ కార్యాలయములో సీల్డువేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.1.30కు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయాలు కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు
1.	ట్యాంకు ఆపరేటర్ పనులు నిర్వహణ-1	1.4.2024 నుండి 31.3.2025 వరకు	రూ.1000/- లేదా హామీపత్రం
2.	వీధి దీపాల రిపేరు పనులు నిర్వహణ-1	- డిటో -	- డిటో -

నోట్ : 1.గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2.గ్రామ పంచాయతీ నిధులను నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును. 3.టెండర్లు నిర్వహించుటకు, రద్దుచేయుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు. 4. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

(సం॥) పి.విజయకుమార్,
పంచాయతీ కార్యదర్శి
చోడవరం నాగాయలంక మండలం

గ్రామ పంచాయతీ కార్యాలయం - కమ్మనమోలు

నాగాయలంక మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:నిల్/2024 **తేదీ: 04.03.2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం కమ్మనమోలు గ్రామ పంచాయతీ నందు 2024-25 సం॥మునకు గాను కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింద తెలిపిన పనులు చేయుటకు గాను ది.12-03-2024వ తేదీ ఉదయం గం.10-30ని॥లకు గ్రామ పంచాయతీ కార్యాలయములో సీల్డువేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.12.30కు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయాలు కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు
1.	పారిశుధ్య నిర్వహణ-1	1.4.2024 నుండి 31.3.2025 వరకు	రూ.1000/- లేదా హామీపత్రం
2.	వీధి దీపాల రిపేరు పనులు నిర్వహణ-1	- డిటో -	- డిటో -

నోట్ : 1.గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2.గ్రామ పంచాయతీ నిధులను నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును. 3.టెండర్లు నిర్వహించుటకు, రద్దుచేయుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు. 4. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

(సం॥) పి.విజయకుమార్,
పంచాయతీ కార్యదర్శి,
కమ్మనమోలు, నాగాయలంక మండలం

గ్రామ పంచాయతీ కార్యాలయం - పెదపాలెం

నాగాయలంక మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:నిల్/2024 **తేదీ: 04.03.2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం, పెదపాలెం గ్రామ పంచాయతీ నందు 2024-25 సం॥మునకు గాను కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింద తెలిపిన పనులు చేయుటకు గాను ది.11-03-2024వ తేదీ ఉదయం గం.10-30ని॥లకు గ్రామ పంచాయతీ కార్యాలయములో సీల్డువేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.12.30కు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయాలు కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు
1.	ట్యాంకు ఆపరేటర్ పనులు నిర్వహణ-1	1.4.2024 నుండి 31.3.2025 వరకు	రూ.1000/- లేదా హామీపత్రం
2.	వీధి దీపాల రిపేరు పనులు నిర్వహణ-1	- డిటో -	- డిటో -

నోట్ : 1.గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2.గ్రామ పంచాయతీ నిధులను నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును. 3.టెండర్లు నిర్వహించుటకు, రద్దుచేయుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు. 4. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

(సం॥) పి.విజయకుమార్,
పంచాయతీ కార్యదర్శి,
పెదపాలెం, నాగాయలంక మండలం

గ్రామపంచాయతీ కార్యాలయం, పాములలంక

తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా

ఆర్.ఓ.సి. నెం. 10/2024 **టెండరు ప్రకటన** **తేది : 05-03-2024**

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, పాములలంక గ్రామపంచాయతీ పరిధిలో 2024-2025 సం॥నకు ది. 1-4-2024 నుండి 31-3-2025వ తేదీ వరకు ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహించుటకు రోజువారీ రేటు కాంట్రాక్టు పద్ధతిపై సీల్డు టెండర్లు ది. 19-03-2024వ తేదీన మంగళవారం సాయంత్రం 4-00 గం.లవరకు టెండర్లు స్వీకరించబడును. సదరు స్వీకరించిన టెండర్లు అదేరోజు సాయంత్రం 4-30 గం.లకు టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచేగాని లేక వారి అనుమతి పొందిన వారిచేగానీ టెండర్లు తెరువబడును. కావున సదరు టెండర్లలో పాల్గొనదలచిన వారు పంచాయతీ కార్యదర్శి వారి షరతులకు లోబడి నిర్ణీత టెండరు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేసుకొనవలయును. ఇతర వివరములు కొరకు గ్రామపంచాయతీ కార్యాలయం పనివేళల యందు సంప్రదించి సమాచారం తెలుసుకొన వలయును.

వ.నెం.	పనివివరములు	కావలసిన వ్యక్తుల సంఖ్య	ఒక్కొక్కరికి ధరావత్తు
1.	రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణ పనులు నిర్వహించుట	1	రూ.500/-
2.	వీధి దీపముల రిపేరులు మరియు నిర్వహణ పనులు నిర్వహించుట	1	రూ.500/-

నోట్ : 1 గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు చేయబడును.
2) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం॥ శీలం రమేష్
సర్పంచ్
పాములలంక గ్రామపంచాయతీ

సం/- పి. సత్యనారాయణ
పంచాయతీ కార్యదర్శి, పాములలంక
తోట్లవల్లూరు మండలం.

దస్తావేజులు పోయినవి

పెనుగంచిప్రోలు మండలం, వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల కే పొన్నవరం గ్రామ వాస్తవ్యులు అన్నేపాక పద్మ భర్త మార్కపుడి సుబ్బారావు స్వగ్రామం నుండి విజయవాడ వెళ్తుండగా మార్గ మధ్యలో డాక్యుమెంట్లు పోయినవి. దస్తావేజు నంబర్ 487/2000, డి.నెంబర్ 370, 83వ ప్లాట్లో ఐదు సెంట్లు ఖాళీ స్థలం భూమితో రిజిస్ట్రేషన్ అయింది.. దస్తావేజులు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు పంపగలరు.

ఇట్లు
అన్నేపాక పద్మ, భర్త మార్కపుడి సుబ్బారావు,
కే.పొన్నవరం, వెంకటాపురం గ్రామపంచాయతీ,
పెనుగంచిప్రోలు మండలం ఎన్టీఆర్ జిల్లా,
సెల్ నెంబర్ 9703740107,7416238999.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ భీమవరపు సుబ్బారెడ్డి తండ్రి : గోపిరెడ్డి, హిందువు, వయస్సు 67 సం॥లు, నున్న గ్రామం, విజయవాడ రూరల్ వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ది. 2-3-2024న నా క్లయింట్ నున్న నుండి బయలుదేరి పైపులరోడ్డు ఎస్‌బిఐ నకు ద్విచక్ర వాహనం మీద బయలుదేరి ఎస్‌బిఐ నందు పని ముగించుకొని తిరిగి నున్న గ్రామం ఇంటికి వచ్చి బ్యాగును సరిచూడగా నా క్లయింట్‌కు చెందిన ఒరిజినల్ దస్తావేజులు డాక్యుమెంట్ నెం. 2922/2011, 397/2011 నున్న ఎస్ఆర్ఓకు చెందినవి కనబడుట లేదు. కావున పై తెల్పిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్సునకు తెలియజేయగలరు. నేటి నుండి సదరు దస్తావేజులపై ఎటువంటి వ్యవహారములు ఇతర వ్యక్తులు జరిపిన యెడల అవి నా క్లయింట్‌ను ఏ మాత్రము బైండు చేయజాలవు.

ఇట్లు
ఎస్ఆర్ఎం ఛాంబర్ ఆఫ్ లా
కిరణ్‌బాబు తగరం, అడ్వకేట్,
ఎల్ఐసి కాలనీ, ఐటిఐ కాలేజి ఎదురు,
విజయవాడ. సెల్ : 6300114939.

శ్రీ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

నోటీసు

అండర్ ఆర్డరు 5రూలు 20ఆఫ్ సివిలు ప్రొసీజరల్ కోడ్

O.S.No : 219/2023

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్,
అరివేముల తరుపున వారి బ్రాంచ్ మేనేజర్ ..వాది
మరియు
శ్రీమతి. కటారి కొండమ్మ మరియు ఒకరు
... ప్రతివాదులు

టు,
శ్రీమతి. కటారి కొండమ్మ,
భర్త: వెంకట కొండయ్య,
ఇంటి నెంబరు: 18-09-16,
కేదారేశ్వరి పేట, 2వ లైన్,
గాంధీనగరం, విజయవాడ,
కృష్ణాజిల్లా. గారికి

పై నెంబరు నా దావాలో శ్రీ కోర్టు వారు మీకు దావా సమన్లు పత్రికా ముఖంగా ఆదేశించి యున్నారు. కావున మీరు తే.22-03-2024 దిన ఉదయం గం.10.30 కు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ మీ లాయరు ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షముననే దావాను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 22-03-2024

(బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్)
యం.వి. విజయకుమార్,
వాది తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా.
సెల్.9490729398

గ్రామపంచాయతీ కార్యాలయం, చాగంటిపాడు

తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా

ఆర్.ఓ.సి. నెం. 12/2024 **టెండరు ప్రకటన** **తేది : 05-03-2024**

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, చాగంటిపాడు గ్రామపంచాయతీ పరిధిలో 2024-2025 సం॥నకు ది. 1-4-2024 నుండి 31-3-2025వ తేదీ వరకు ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహించుటకు రోజువారీ రేటు కాంట్రాక్టు పద్ధతిపై సీల్డు టెండర్లు ది. 20-03-2024వ తేదీన బుధవారం ఉదయం 11-00 గం.ల వరకు టెండర్లు స్వీకరించబడును. సదరు స్వీకరించిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2-00 గం.లకు టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచేగాని లేక వారి అనుమతి పొందిన వారిచేగానీ టెండర్లు తెరువబడును. కావున సదరు టెండర్లలో పాల్గొనదలచిన వారు పంచాయతీ కార్యదర్శి వారి షరతులకు లోబడి నిర్ణీత టెండరు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేసుకొనవలయును. ఇతర వివరములు కొరకు గ్రామపంచాయతీ కార్యాలయం పనివేళల యందు సంప్రదించి సమాచారం తెలుసుకొన వలయును.

వ.నెం.	పనివివరములు	కావలసిన వ్యక్తుల సంఖ్య	ఒక్కొక్కరికి ధరావత్తు
1.	స్వీపర్ కమ్ మెయిన్ విలేజ్ పిడబ్ల్యుఎస్ స్కీమ్ ఆపరేటర్	1	రూ.500/-
2.	ఎస్‌సి కాలనీ పిడబ్ల్యుఎస్ స్కీమ్ ఆపరేటర్	1	రూ.500/-
3.	కళ్ళంవారిపాలెం పిడబ్ల్యుఎస్ స్కీమ్ ఆపరేటర్	1	రూ.500/-
4.	ఆళ్ళవారిపాలెం పిడబ్ల్యుఎస్ స్కీమ్ ఆపరేటర్	1	రూ.500/-
5.	పిల్లివానిలంక డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ ఆపరేటర్	1	రూ.500/-
6.	ఎలక్ట్రీషియన్ కమ్ స్విచ్‌బోర్డు ఆపరేటర్ సేవలు	1	రూ.500/-

నోట్ : 1 గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు చేయబడును.
2) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం॥ మర్రెడ్డి లక్ష్మి
సర్పంచ్
చాగంటిపాడు గ్రామపంచాయతీ

సం/- పి. సత్యనారాయణ
పంచాయతీ కార్యదర్శి, చాగంటిపాడు
తోట్లవల్లూరు మండలం.

గ్రామపంచాయతీ కార్యాలయం, భద్రిరాజుపాలెం

తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా

ఆర్.ఓ.సి. నెం. 15/2024 **టెండరు ప్రకటన** **తేది : 05-03-2024**

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, భద్రిరాజుపాలెం గ్రామపంచాయతీ పరిధిలో 2024-2025 సం॥నకు ది. 1-4-2024 నుండి 31-3-2025వ తేదీ వరకు ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహించుటకు రోజువారీ రేటు కాంట్రాక్టు పద్ధతిపై సీల్డు టెండర్లు ది. 19-03-2024వ తేదీన మంగళవారం ఉదయం 11-00 గం.ల వరకు టెండర్లు స్వీకరించబడును. సదరు స్వీకరించిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2-00 గం.లకు టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచేగాని లేక వారి అనుమతి పొందిన వారిచేగానీ టెండర్లు తెరువబడును. కావున సదరు టెండర్లలో పాల్గొనదలచిన వారు పంచాయతీ కార్యదర్శి వారి షరతులకు లోబడి నిర్ణీత టెండరు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేసుకొనవలయును. ఇతర వివరములు కొరకు గ్రామపంచాయతీ కార్యాలయం పనివేళల యందు సంప్రదించి సమాచారం తెలుసుకొన వలయును.

వ.నెం.	పనివివరములు	కావలసిన వ్యక్తుల సంఖ్య	ఒక్కొక్కరికి ధరావత్తు
1.	ప్రజారోగ్యం పారిశుధ్యము	3	రూ.500/-
2.	రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణ పనులు నిర్వహించుట	2	రూ.500/-
3.	వీధి దీపముల రిపేరులు మరియు నిర్వహణ పనులు నిర్వహించుట	1	రూ.500/-

నోట్ : 1 గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు చేయబడును.
2) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం॥ కొక్కిలిగడ్డ హేమలత
సర్పంచ్
భద్రిరాజుపాలెం గ్రామపంచాయతీ

సం/- పి. సత్యనారాయణ
పంచాయతీ కార్యదర్శి, భద్రిరాజుపాలెం
తోట్లవల్లూరు మండలం.

గ్రామ పంచాయతీ కార్యాలయం - సొర్లగొంది

నాగాయలంక మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:నిల్/2024 **తేదీ: 04.03.2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం, పెదపాలెం గ్రామ పంచాయతీ నందు 2024-25 సం॥మునకు గాను కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింద తెలిపిన పనులు చేయుటకు గాను ది.12-03-2024వ తేదీ ఉదయం గం.11-00ని॥లకు గ్రామ పంచాయతీ కార్యాలయములో సీల్డువేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.01.00కు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయాలు కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు
1.	పారిశుధ్య నిర్వహణ	1.4.2024 నుండి 31.3.2025 వరకు	రూ.1000/- లేదా హామీపత్రం
2.	వీధి దీపాల రిపేరు పనులు నిర్వహణ	- డిటో -	- డిటో -

నోట్ : 1.గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2.గ్రామ పంచాయతీ నిధులను నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును. 3.టెండర్లు నిర్వహించుటకు, రద్దుచేయుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు. 4. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

(సం॥) పి.విజయకుమార్,
పంచాయతీ కార్యదర్శి,
సొర్లగొంది, నాగాయలంక మండలం

గ్రామ పంచాయతీ కార్యాలయం - వక్కపట్లవారిపాలెం

నాగాయలంక మండలం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:నిల్/2024 **తేదీ: 04.03.2024**

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం, వక్కపట్లవారిపాలెం గ్రామ పంచాయతీ నందు 2024-25 సం॥మునకు గాను కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింద తెలిపిన పనులు చేయుటకు గాను ది.11-03-2024వ తేదీ ఉదయం గం.10-00ని॥లకు గ్రామ పంచాయతీ కార్యాలయములో సీల్డువేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.12.00కు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. మిగిలిన విషయాలు కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	కాలము	ధరావత్తు
1.	ట్యాంకు ఆపరేటర్ పనులు నిర్వహణ-1	1.4.2024 నుండి 31.3.2025 వరకు	రూ.1000/- లేదా హామీపత్రం
2.	వీధి దీపాల రిపేరు పనులు నిర్వహణ-1	- డిటో -	- డిటో -

నోట్ : 1.గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2.గ్రామ పంచాయతీ నిధులను నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును. 3.టెండర్లు నిర్వహించుటకు, రద్దుచేయుటకు గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం కలదు. 4. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

(సం॥) పి.విజయకుమార్,
పంచాయతీ కార్యదర్శి,
వక్కపట్లవారిపాలెం, నాగాయలంక మండలం



వందశాతం పోలియోచుక్కలు నమోదు

ప్రజాశక్తి-పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1720 మందికి వందశాతం పోలియో చుక్కలు వేశామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. మంగళవారం మండలంలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ లంకపల్లి, అయినపూరు, చొరగుడి, కష్ణాపురం గ్రామాల్లో చుక్కలు వేశామని, చివరి రోజైన మంగళవారం ఇంటింటికి తిరిగి రిపోర్టు తయారు చేశమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రమణీ, పిహెచ్ఎం ఝాన్సీ, హెచ్‌వి దేవ కమలం, కష్ణమోహన్, కపిలేశ్వరపురం పిహెచ్‌సి డాక్టర్ మమత, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున టిడిపి నాయకులు

అసత్య ప్రచారాలు తగదు : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్నికల సమయంలో కూడా అవనిగడ్డ-కోడూరు రహదారిపై ఎమ్మెల్యే మోసపూరిత మాటలేనా అంటూ టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ కోడూరు రోడ్డు నిర్మాణానికి ఏడో తేదీ శంకుస్థాపన అని కథనాలు వచ్చాయని, జిల్లా వ్యాప్తంగా 143 కిలోమీటర్ల రోడ్లు పాడైపోయాయని, దానికి సుమారు 93 కోట్ల అవసరం ఉందని ప్రభుత్వానికి అధికారులు నివేదిక అందించగా దాని నిమిత్తం ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 16.66 కోట్లు నిధులు మరమ్మత్తులకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కానీ 16.80 కోట్ల రూపాయలతో అవనిగడ్డ కోడూరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు వైసీపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అసలు కాంట్రాక్టర్ వద్ద బ్యాంకు గ్యారెంటీ తీసుకొని ఆర్ అండ్ బి అధికారులు అగ్రిమెంట్ ఇవ్వకముందే రోడ్డు ఎలా వేస్తారు అంటూ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు లుక్కా పిచ్చయ్య బచ్చు రఘునాథ్ దండు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీ బృందం సేవలు మరువలేనివి : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమకు జర్మనీకి చెందిన గుజ్జుల రవీంద్ర బందం చేసిన సేవలు మరువలేనివని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. దివిసీమలో చేసిన అభివృద్ధిని పరిశీలించేందుకు జర్మనీ బృందం మంగళవారం నాగాయలంక మండలం పెదపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ మాట్లాడారు. ప్రకాశం జిల్లాకు చెందిన గుజ్జుల రవీంద్ర జర్మనీలో విద్యను అభ్యసించి డాక్టర్ మతి చేస్తూ ఆల్ట్రాండ్స్ బర్గ్‌కు 5 పర్యాయాలు మేయర్గా శాసన సభ్యుడిగా పనిచేశారన్నారు. సునామీ అనంతరం నాగాయలంకలో పలకడదివి పెద్దపాలెం గ్రామాలలో 314 ఇళ్ళను పలు గ్రామాల్లో తుఫాను షట్టర్లకు సహ కారం అందించిన తీరు మరువలేనిదన్నారు. అనంతరం బందం సభ్యులను గ్రామ సర్పంచ్ దున్న రాజేష్ పూలమాలలు శాలువాలతో



శిలాఫలకాలను పరిశీలిస్తున్న గుజ్జుల రవీంద్ర, బుద్ధ ప్రసాద్ బృందం సభ్యులు

సత్కరించారు. జర్మనీ బందం సభ్యులు గుజ్జుల గాబ్రియల్ ఎర్నాడ్, లూ ద్వి ంగ్ బొ చ్చ ర్, మరై కె బ్రూనే, గుం ట్టే ర్ రూపెర్స్, బె ర్గర్ కె ర్టైన్ రారిట్, మరియానే, బుడిగ జమీందార్ రోమీళ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకట్రావు పాల్గొన్నారు.

జయహో బిసి సదస్సుకు తరలిన టిడిపిశ్రేణులు



గుడివాడలో జెండాఊపి వాహనాలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ టిడిపి ఇంచార్జ్, అభ్యర్థి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో జరిగే జయహో బీసీ సదస్సుకు కార్లు, బస్సులు,బైక్ లు మొత్తం 400 వాహనాల్లో సదస్సుకు 5వేల మంది గుడివాడ నుండి బయలుదేరి వెళ్ళారు. మంగళవారం టిడిపి కార్యాలయం వద్ద భారీ వాహన ర్యాలీను వెనిగండ్ల రాము,మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో గుడివాడ పట్టణ, రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, కష్ణాజిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్(కాశి), గుడివాడ నియోజకవర్గ అధ్యక్షుడు అంగడాల శ్రీనివాసరావు, బీసీ సంఘాల నాయకులు పోలగాని కష్ణయ్య, రెడ్డి అప్పారావు, రామిదేని వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** గుంటూరు జిల్లా మంగళగిరిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా టిడిపి జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ సభకు అవనిగడ్డ నియోజకవర్గం టీడీపీ బీసీ నేతలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం ముందుగా టిడిపి కార్యాలయం ఎదురుగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు పార్టీ జెండాలు ఊపి ర్యాలీని ప్రారంభించారు. టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, బీసీ నాయకులు లుక్కా పిచ్చయ్య, మొగల్ కొపనాతి, సత్యనారాయణ, గోళ్ల సుబ్బయ్య, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ పాల్గొన్నారు

రూ.815 కోట్ల ఉపాధి పనులు

ప్రజాశకి-ఉంగుటూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 27 గ్రామ పంచాయతీలలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికిగాను 815 కోట్ల రూపాయల ఖర్చు చేసినట్లు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజా వేదిక నిర్ణయిందని ఎపిఓ టి. వినీలా తెలిపారు. 27 గ్రామ పంచాయితీలకు రికవరీ రూపంలో 37 వేలు, మైనర్ పెనాల్టీ రూపంలో రూ 34,400లు ప్రిసైడింగ్ అధికారి పెనాల్టీ విధించారన్నారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ జి వి సూర్యనారాయణ, అసిస్టెంట్ ప్రోగ్రాం డైరెక్టర్స్ ఎ ఎన్ వి నాంచార్లరావు, రామ్మోహన్ రావు, లక్ష్మి రెడ్డి, ఎంపిపి, వడ్లమూడి సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి పెద్దకళ్లేపల్లికి 20 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సు సర్వీసులు అవనిగడ్డ నుండి పెదకళ్ళేపల్లి, చల్లపల్లి నుండి పెదకం డేపల్లి ,మచిలీపట్నం నుండి పెదకళ్ళేపల్లికి నడుపుతున్నట్లు తెలిపారు. ఈనెల ఏడవ తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు ఈ ప్రత్యేక బస్ సర్వీస్ లను నడపనున్నట్లు చెప్పారు. కావున యాత్రికులు ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

బస్టాండ్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



జంక్షన్‌లో ఆర్‌టిసి బస్టాండ్ ను ప్రారంభిస్తున్న దృశ్యం



బంటుమిల్లిలో బస్టాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : హనుమాన్ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ను మంగళవారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డిలు సంయుక్తంగా కలిసి బస్టాండ్ ప్రారంభించారు. బస్టాండ్ నిర్మాణ పనులు జూన్ 2022 ప్రారంభించి మార్చి 2024కు పూర్తి చేశామని, ప్రయాణికుల సౌకర్యాల కోసం నూతన బస్టాండ్ నిర్మించినట్లు తిరుమలరావు తెలిపారు. నూతన బస్టాండ్ ఆవరణలో కార్గో పాయింట్, నెల వారీ పాస్ ల జారీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ ఎల్లవేళలా ప్రయత్ని స్తుందని ప్రకటించారు. ఈకార్యక్రమంలో విజయవాడ, గన్నవరం డిపోలకు సంబంధించిన ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నం బస్టాండ్ పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం బస్టాండ్ ను ద్వారకా తిరుమలరావు మంగళవారం తనికీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం బస్టాండ్ లో 3.5 కోట్ల తో వివిధ అభివద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే చాలా పనులు పూర్తి అయ్యాయని మరికొన్ని పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే వున్న 12 ప్లాట్ ఫామ్స్ కాకుండా మరో 8 ప్లాట్ ఫామ్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అనేక సదుపాయాల కల్పిసున్నన్నామని తెలిపారు.

బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండల పరిధిలోని బంటుమిల్లిలో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన మంగళవారం నిర్వహించారు.ఈ సుమారు 40 లక్షల రూపాయలతో ఈదీనిని నిర్మిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రాము, ఆర్‌టిసి ఎండి సి.హెచ్ ద్వారక తిరుమలరావు, చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, విజయవాడ ఆర్‌టిసి జోనల్ చైర్మన్, బోర్డ్ డైరెక్టర్ పిన్నింటి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ పస్తం వాకలయ్యాను సన్మానిస్తున్న దృశ్యం

వాకలయ్యకు సన్మానం

ప్రజాశక్తి-పెడన : స్థానిక బేడా(బుడగ)జంగం సంఘం నూతన కమిటీ అధ్యక్షునిగా పస్తం ఒక లేను వాకలయ్యను మంగళవారం ఎన్నికయ్యారు. స్థానిక 18 వ వార్డులోని బేడ, జంగం వెల్ఫేర్ సొసైటీ కమిటీ కార్యాలయంలో ఆయనను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వాకలయ్య మాట్లాడుతూ శక్తివంచన లేకుండా కషి చేస్తాననన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు, నిధులు సమకూర్చేలా పాటుపడతానని వివరించారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన తగినంత న్యాయం జరిగేలా పోరాడుతామని అన్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా సిరిగిరి విజయరాజు, సెక్రటరీగా పస్తం పైడేశ్వరావు, జాయింట్ సెక్రటరీగా బైలపాటి నాని, కోశాధికారిగా పస్తం అబ్రహం, సలహాదారులుగా పస్తం మహాలక్షుముడు, బైలపాటి తుకరం, సభ్యులు పుట్ట సురేష్, కళ్యాణి దాసు, పస్తం సుందరబాబు, టేకు రాజశేఖర్ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బేడా(బుడగ)జంగం హక్కుల పోరాట సమితి కష్ణాజిల్లా అధ్యక్షులు సిరిగిరి నాంచారయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రస్ట్ సభ్యులను సత్కరించారు.

డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కష్ణా విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాలు ను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి మంగళవారం విడుదల చేశారు. మొత్తం 9,024 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 5,312 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 58.86 ఉత్తీర్ణత శాతం సాధించారు.ఈ నెల 18 లోపు పునః మూల్యాంకనం కు దరకాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : పద్దెనిమిది సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ఉత్తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని ఏజీ,ఎస్‌జి డిగ్రీ కళాశాల అధ్యాపకులు డి మధుసూదనరావు సూచించారు. ఏజీ, ఎస్‌జి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎన్నికలు, ఆవశ్యకత, ఓటు వేద్దాం, మనభవిష్యత్తు తీర్చిదిద్దుకుందాము అనే అంశంపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఓటుహక్కుపై అవగాహ కల్పించారు. ఈసందర్భంగా ఓటు హక్కు, ఓటు వినియోగం, ఎటువంటి వారు ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హులు అనే వాటిపై విద్యార్థుల సందేహాలు నివృత్తిచేశారు. కళాశా ల ప్రిన్సిపాల్ డి శ్రీరామ్, ప్రత్యేకఅధికారి సత్యనారాయణ, రాజనీతిశాస్త్ర శాఖ అధిపతి సీహెచ్ సంధ్యారాణి పాల్గొన్నారు.

నాగార్జున పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థల వితరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక నిమ్మల తోటలోని సీయోను వద్ధాశ్రమ భవన నిర్మాణానికి లక్ష్మీపురం శివారు రామానగరం నాగార్జున పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థ రూ.85000లు ఆర్థిక సాయాన్ని ఆశ్రమ నిర్వాహకులు సేలం భాస్కరరావుకు మంగళవారం అందించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ దొనేపుడి మురళికృష్ణ, ఆయన సతీమణి డా.దోనేపుడి భవ్య జ్యోతి , పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది కలిసి అందచేశారు.



బీమా పట్ల ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : బీమా పరిశ్రమ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని, కొత్తగా బీమా తీసుకునే వారి సంఖ్య పెరుగుతుందని పిబి పార్టనర్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ధృవ్ సరేశ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో పిబి పార్టనర్స్ ఆధ్వర్యంలో బీమాపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రతి ఒక్కరికి బీమా అవసరమని ఈ దశలోనే బీమా పట్ల ఆసక్తి కనపరచే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. 2030 నాటికి 14 మిలియన్ల మధ్య తరగతి ప్రజలు కొత్తగా బీమా తీసుకుంటారని అన్నారు. ఇటీవల కాలంలో ప్రజలకు బీమా పట్ల అవగాహన, ఆసక్తి కల్పించడంలో పలు సంస్థలు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ జీవితం కోసం బీమా తప్పనిసరి అన్నారు.

7న ఎంజె నాయుడు హాస్పిటల్‌లో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ ఎంజె నాయుడు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 7న సూర్యరావుపేటలోని హాస్పటల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎంజె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలనుండి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో మహిళలకు ఎముకల సాంద్రత (బిఎండి) పరీక్షలు చేస్తామని చెప్పారు. పరీక్షలు అనంతరం వైద్యులు తగిన సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిఏటా తమ హాస్పటల్ ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఏడాది అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని నగర మహిళలు సద్వినియోగం చేసుకోగలరు. వివరాలకు 9640133302 ఈ నంబర్‌ను సంప్రదించగలరని కోరారు.

'నాడు నేడు'లో పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు పరుస్తూ సర్కారు బడులను మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తూ వందల కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారని ప్రభుత్వవిప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని నాగమయ్య బజార్, మిట్టగుడేం, బాయ్స్ హై స్కూల్, కాకాని నగర్, సీతారాంపురంలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కోటి రూపాయల వ్యయంతో అదనపు తరగతి గదులు, మౌలిక వసతులను ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు 'మన బడి నాడు - నేడు' పేరుతో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభించిన సామినేని ఉదయభాను

ఆకృతిలో చీరల విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డులో గల ఆకృతి షోరూంలో చీరల విభాగాన్ని సినీ నటి, జబర్దస్త్ ఫేమ్ అనసూయ మంగళవారం ప్రారంభించారు. ఆమెతోపాటు ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను సతీమణి, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలా బాను, విశ్వభారతి కాలేజ్ ప్రిన్సిపాల్ కె.పద్మ తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట ప్రాంత మహిళల అభిరుచికి కనుగుణంగా దూరప్రాంతాలకు వెళ్ళకుండా అన్ని రకాల ధరలలో, అన్ని రకాల కేటగిరీలలో, అందరికీ నచ్చే డిజైన్లలో ఆకృతిలో చీరలు బాగున్నాయని అనసూయ అన్నారు. ఆకృతిని ఆదరించాలని మహిళలు అక్కున చేర్చుకోవాలని, ఎన్నెన్నో ఆఫర్లను మహిళల కోసం తీసుకువచ్చిన యాజమాన్యాన్ని ఆమె అభినందించారు.

అనసూయ కోసం అభిమానుల సందడి

ఆకృతి షోరూంలో శారీస్ విభాగం ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీనటి జబర్దస్త్ ఫేమ్ అనసూయను చూసేందుకు మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ప్రత్యేకంగా పోలీసులు, బౌన్సర్లు ఆకృతి షోరూం ఎదుట ఎలాంటి సంఘటనలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. షోరూం ప్రారంభం అయ్యాక సందర్శకులను అనుమతించారు. అప్పటివరకు అనసూయ భద్రతకు వచ్చిన బౌన్సర్లు పోలీసులు అభిమానులను నియంత్రించేందుకు నానా అవస్థలు పడ్డారు. ఆ రోడ్డులో సందర్శకులు, అనసూయ అభిమానుల రాకతో ట్రాఫిక్



జామ్ అయింది. ఈ సందర్భంగా నిర్వహించిన కేరళ నత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. అభిమానుల కోసం అనసూయ సినీగీతాలకు స్టెప్పులు వేసి అలరించారు. జగ్గయ్యపేట ప్రజలు, అభిమానులకు సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

తిరువూరులో ఉద్రిక్తత

వైసిపి, టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థుల గృహనిర్బంధం

ప్రజాశక్తి - తిరువూరు : టిడిపి, వైసిపి ప్రత్యర్థుల మధ్య చోటుచేసుకున్న సవాళ్ల పర్వం మంగళవారం ఇద్దరు నేతల గృహనిర్బంధంతో ముగిసింది. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్, వైసిపి ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాస్ మధ్య జరిగిన దూషణల పర్వం జరిగింది. ఒకరిపై మరొకరు వ్యక్తిగత దూషణలతో దమ్ముంటే మంగళవారం ఉదయం తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో తేల్చుకుందాం అంటూ సవాళ్లు చేసుకున్నారు. ఈ తరుణంలో ఇరు పక్షాల నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు నేతలు ఎదురెదురు పడితే పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు నేతల ఇళ్లకు వచ్చేశారు. సిఐ అబ్దుల్ నబీ, ఎస్సై సత్యనారాయణల ఆధ్వర్యంలో పోలీసులు శ్రీనివాస్‌ను, స్వామిదాస్‌లను గృహనిర్బంధం లోనికి తీసుకున్నారు. పోలీసుల పహారాలో నాయకులిద్దరు బయటకు రాకుండా కట్టుదిట్టం చేశారు. దానితో ఇద్దరు నేతల మధ్య సవాల్ ప్రతి సవాల్ పర్వానికి తెరపడింది.



గృహ నిర్బంధంలో ఉన్న కొలికపూడి



లైసెన్సులు, సర్టిఫికెట్లు భౌతిక రూపంలోనే ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు భౌతిక రూపంలో (లామినేటెడ్ కార్డు లేదా స్మార్టు కార్డు) జారీ చేయాలని జాతీయ రహదారి భద్రతా మండలి సభ్యులు డాక్టర్ కమల్ సోయ్ అన్నారు. నగరంలోని ఓహోటల్‌లో మంగళవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సులు భౌతిక రూపంలో ఇవ్వాలన్నారు. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్, 1989లో పేర్కొన్న విధంగా డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు భౌతిక రూపంలో ఇవ్వాలని చూడా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఆవిధంగా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇవ్వాలన్నారు.

కూచిపూడి నాట్యంలో శ్రావ్య ప్రతిభ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సంపసాల శ్రావ్య తృత్యంలో ప్రతిభ కనబరిచి వివిధ పురస్కారాలు అందుకున్న సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.పద్మలత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా చిన్న వయసులోనే నాట్యంలో ప్రతిభ కనబరిచేలా తయారుచేసిన నాట్యగురువులు నాట్యాచార్య సప్పా శివకుమార్‌ను ప్రశంసించారు. గత నెలలో కాకినాడలో జ్యోతి నృత్య కళానికేతన్ వారు నిర్వహించిన నర్తనకేళి నంది పురస్కారం కార్యక్రమంలో నంది పురస్కారాన్ని చిన్నారి శ్రావ్య అందుకున్నట్లు తెలిపారు. మార్చి 2న విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ నత్యాంజలి 2024 కార్యక్రమంలో నాట్య దీపిక బిరుదు



సత్కారాన్ని ప్రశంస పత్రాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాధే శ్యామ్ చేతుల మీదుగా అందుకున్నట్టుగా తెలియజేశారు. ఈ చిన్నారి నాట్యంలో ఇంకా బాగా రాణించి ఎన్నో పురస్కారాలను సత్కారాలను పొందాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్ టీచర్ అమలరాణి, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వాలి



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రతి పాఠశాలలోనూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించి పిల్లలలో మంచి క్రమశిక్షణ అలవర్చేందుకు తోడ్పడాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. పటమటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎన్‌టిఆర్ జిల్లా విభాగం వన్డే బిగినర్స్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను అన్ని పాఠశాలల్లోనూ స్థాపించి మన జిల్లాను ప్రత్యేకమైన జిల్లాగా నిలపాలని కోరారు. విజయవాడ ఉప విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్ మాట్లాడుతూ పిల్లలలో మంచి సేవా తత్వం నేర్పడానికి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడతుందని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కోర్సు డైరెక్టర్లుగా తేలప్రోలు జిల్లా పరిషత్ స్కూల్ ఉపాధ్యాయులు పి.దాసు, జగ్గయ్యపేట ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయులు డి.నాగేశ్వరరావు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా స్కౌట్స్ కమీషనర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం, పటమల జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, సీతారెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ దారం ప్రసాద్, వరకుమార్, శర్మ, ఎం.అఖిల్, కొప్పుల సుగణరావు , ఎన్‌టిఆర్ జిల్లా సెక్రటరీ పి.మురళీ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిసా వనితా మండలి అధ్వర్యంలో ఎ - కాలనీలోని ఎస్.వి.సి.టి. కల్యాణ మండపంలో మంగళవారం మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, థర్మల్ సతీమణి రత్నకుమారి విచ్చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలది సమాన పాత్ర ఉంటుందన్నారు. కుటుంబ అభివృద్ధిలో స్త్రీ పాత్ర త్యాగపూరితమైనదని మహిళలు అన్నీ తానై కుటుంబాన్ని చక్కబెట్టుకుంటారని అన్నారు. తదుపరి డైరెక్టర్, హైడిల్ సతీమణి భారతి మాట్లాడుతూ మహిళాభ్యుదయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలనీ తమ హక్కుల కోసం పోరాడిన ముఖ్యమైన మహిళలందరినీ ఈ రోజు స్మరించుకోవాలని తెలిపారు. మహిళా మండలి సేవ కార్యక్రమాలు ఇంకా విస్తరించాలని కోరారు. లత హాస్పిటల్స్, భవానీపురం డాక్టర్ లత ప్రసంగిస్తూ స్త్రీలు తమ ఆరోగ్యంను జాగ్రత్తగ చూసుకొనవలెను స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబము ఆరోగ్యంగా ఉంటున్నది, స్త్రీ మానసిక, శారీరక ఒత్తిడిని కొంత వరకు తగ్గించుకోవాలని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. తదుపరి చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ ఎం.డా.ఎన్.టి.టి.పి.యస్ సతీమణి హేమలత మాట్లాడుతూ చుట్టుపక్కల నివసిస్తున్న మహిళల కోసం



మనం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించవలసి ఉందన్నారు.వివిధ రకాలైన ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సి.కాలనీ మహిళా కమిటీ, మదర్ థెరిసా ఫౌండేషన్ సహకారంతో సహాయమాత పాఠశాల విద్యార్థులకు 60 జతల యూనిఫామ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సునీత డేవిడ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శారదా కాలనీ ఉద్యోగినులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.